క్లుప్తంగా

సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తాం

అశ్వారావుపేటరూరల్: అధ్వానంగా ఉంటున్న అంతర్గత రహదారులను పక్కా సీసీ రోడ్ల నిర్మాణాలతో అభివృద్ధి చేయడమే లక్ష్యమని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీలో నెహ్రూనగర్ వద్ద జాతీయ ఉపాధి హామి పథకం కింద రూ.13 లక్షల వ్యయంతో మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆ తర్వాత పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. నాసిరకంగా చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పంచాయతీ పరిధిలోనే ఐదు సీసీ రోడ్లకు సుమారు రూ.50 లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నార్లపాటి సుమతి, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, వెంకన్న, రాములు పాల్గొన్నారు.

సేవాలాల్ జీవితం ఆదర్శనీయం

చంద్రుగొండ: లంబాడీల ఆరాధ్యదైవం సత్ సేవాలాల్ మహరాజ్ జీవితం నేటి తరానికి ఆదర్శమని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రం చంద్రుగొండలోని త్రిమూర్తుల ఆలయ ప్రాంగణంలో ఆదివారం సంత్ సేవాలాల్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఒకప్పుడు లంబాడీలు సంచార జీవనం సాగించారని నేడు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. భక్తిశ్రద్ధలతో భోగ్‌బండారో కార్యాక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, మాళోత్ భోజ్యానాయక్, ఇస్లావత్ వీరన్ననాయక్, గుగులోతు నీలవర్ణ, దశరథ్ నాయక్, మోహన్‌నాయక్, రంగా, మోహన్, సేవ్యా పాల్గొన్నారు.

బీజేపీ బైక్ ర్యాలీ

అశ్వారావుపేటరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం అశ్వారావుపేటలో బైక్ ర్యాలీ చేపట్టారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుంచి రింగ్ రోడ్, గాంధీబొమ్మ సెంటర్, ఖమ్మం రోడ్, భద్రాచలం రోడ్‌లో 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసి, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలు విస్మరించడంపై ప్రజలకు వివరించారు. నాయకులు బి.ప్రసాదరావు, మెట్ట వెంకటేష్, బండారు చంద్రశేఖర్, సాలన పుష్కర్ కుమార్, ఎన్.రాజేష్, ఎం.శ్యాం, మెట్ట రాజేష్, కుమార్ రాజా, ఎస్‌వీటీ కొండ, ఆంజనేయులు, నిరంజన్ దాస్, కె.కృష్ణారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చంద్రుగొండ: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత సంఘం యూనిట్ అధ్యక్షుడు కాళ్లూరి సుధాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల దినోత్సవం ఆదివారం స్థానిక జెడ్పీ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానించారు. సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పూసం నాగేశ్వరరావు, రామకృష్ణ, కృష్ణమాచారి, అజరయ్య, రామిశెట్టి డాలయ్య, ఆంజనేయశాస్త్రి, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

పిట్టల కృష్ణ సంతాప సభ

మణుగూరురూరల్: పేద ప్రజల పక్షాన, పేదల రాజ్యం కోసం పోరాడిన నాయకుడు పిట్టల కృష్ణ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు అధ్యక్షతన కృష్ణ సంతాప సభను నిర్వహించారు. ఈ సభకు హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుదర్శన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల నాయకులు లెనిన్‌బాబు, టీవీఎంవీ ప్రసాద్, యు.నరసింహరావు, బి.రాజు, టి.పద్మ, వై.నాగలక్ష్మి, సత్యవతి, నాగమణి, సాంబశివరావు, స్వరూప, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ పంచాయతీలోని టేకులగుట్ట గ్రామానికి చెందిన లంకా అప్పారావు అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం మృతుని నివాసంలో అప్పారావు మృతదేహానికి పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, ఉపసర్పంచ్ అక్కిన శ్రీను, నాయకులు ముత్తినేని వాసు, వేములపల్లి రమేష్, బిక్కసాని సత్యనారాయణ, రాగం మల్లయ్య, చిట్యాల సత్యనారాయణ, పెదిరెడ్ల శివాజీ, ఓరుగంటి రమేష్, పర్వత నరేష్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను వేధిస్తున్న అనారోగ్యం

- శీతాకాలం మొదలు దగ్గు, జలుబు, జ్వరాలు
- ప్రస్తుత వాతావరణ మార్పులతో అధిక కేసులు
- ఆస్పత్రులకు పోటెత్తుతున్న వైనం



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

భద్రాచలంఅర్బన్: కొద్దిరోజులుగా మధ్యాహ్నం మండే ఎండ, ఉదయం, రాత్రి తీవ్రమైన చల్లదనంతో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. వాతావరణంలో వచ్చిన ఈ మార్పు అందరి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. జలుబు, దగ్గు, జ్వరాలు తదితర జబ్బులతో చిన్నారులతో పాటు పెద్దలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రత 33 డిగ్రీలకు పైగానే నమోదు కావటం వేసవిని తలపిస్తోంది. భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణంగా చిన్న పిల్లల ఓపీకి రోజూ 45 నుంచి 50 కేసులు వస్తాయి. గడిచిన పది రోజులుగా ఈ సంఖ్య 60కు పైగానే పెరిగింది. ఇన్ పేషంట్‌గా చికిత్సలు పొందుతున్న వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. సాధారణంగా చిన్న పిల్లల వార్డులో 5–8 మంది చిన్నారులు ఉండేవారు. ఆస్పత్రితో పిల్లలకు బెడ్ల సంఖ్య కూడా 10 మాత్రమే. కానీ ఈ నెల 18న 23 మంది, 19న 28 మంది, 20న 27 మంది, 21న 24 మంది, 22న 26 మంది చిన్నారులు ఆస్పత్రిలో చేరారు. ఒక్క ఫిబ్రవరీ నెలలోనే దాదాపు 130 మంది చిన్నారులు వివిధ రకాల వ్యాధుల కారణంగా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందారు. పిల్లల సంఖ్య పెరగడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు చిన్నారులకు చికిత్స చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలివే..

జలుబు, దగ్గు, జ్వరం, శ్వాసకోశ వ్యాధులు, కళ్లలో ఊసులు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, విరేచనాలు తదితర సమస్యలు వీరిలో కనిపిస్తున్నాయి. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఈ నెల ఫిబ్రవరి నెలలో 130 మంది చిన్నారులు చేరితే వారిలో న్యూమోనియాతో 55 శాతం మంది, మలేరియా జ్వరంతో 10 శాతం మంది, వైరల్ జ్వరంతో 20 శాతం మంది చేరారు. అదే విధంగా వాంతులు, డయేరియా, ఇతర కేసులకు సంబంధించి 15 శాతం మంది చిన్నారులు చికిత్స పొందారు. వీరు డిశ్చార్జ్ అవ్వగా.. ప్రస్తుతం చికిత్స పొందుతున్న చిన్నారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ రద్దీ పెరిగింది. ల్యాబులు కూడా పరీక్షల కోసం వచ్చిన వారితోకిటకిటలాడుతున్నాయి.

జాగ్రత్తలు సూచిస్తున్న వైద్యులు..

భిన్న వాతావరణంతో పిల్లలు తీవ్ర అనారోగ్య పరిస్థితులకు గురవుతున్న నేపథ్యంలో వైద్యులు పలు జాగ్రత్తలు పాటించాల్సిందిగా సూచిస్తున్నారు. వాటిని పరిశీలిస్తే.. రాత్రి వేళ పిల్లలకు వేడిని ఇచ్చే దుస్తులను తొడగాలి. జలుబు, దగ్గు, జ్వరం వచ్చిన వారు చిన్న పిల్లలకు దూరంగా ఉండటం అవసరం. పిల్లల్లో ఒకరికి జలుబు వస్తే మిగతా వారికి దూరంగా ఉంచాలి. తద్వారా ఇన్‌ఫెక్షన్ ఇతరులకు సోకకుండా ఉంటుంది. బయట లభించే ఆహార పదార్థాలు, చిరుతిండ్లను పిల్లలకు ఇవ్వకూడదు. ఐస్‌క్రీమ్, చల్లటి పదార్థాలు, కూల్‌డ్రింక్స్ వంటివి తీసుకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. చల్లగా ఉన్నప్పుడు, వేడిగా ఉన్నప్పుడు పిల్లలను ఇంట్లో నుంచి బయటికి పోకుండా చూడాలి.

త్వరగా వైద్యులను సంప్రదించాలి



చిన్న పిల్లలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సలు అందించాలి. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వాతావరణంలో తరచూ మార్పులు వస్తే వారి శరీరం తట్టుకోలేదు. అందుకే దగ్గు, జలుబు, జ్వరం, శ్వాసకోశ ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారు. ఈ సమయంలో చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలి.

– డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, పిల్లల వైద్య నిపుణుడు, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

ప్రత్యేక సేవలు అందిస్తున్నాం..



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చిన్నారులకు ప్రైవేట్ ఆస్పత్రిలో అందించే నూతన వైద్య విధానాన్ని అందిస్తున్నాం. గతంతో పోల్చుకుంటే ఏరియా ఆస్పత్రిలో చిన్నారులకు అందించే వైద్యంలో అనేక మార్పులు వచ్చాయి. చిన్నారుల చికిత్స కోసం ఇప్పటికే 10 బెడ్లు ఏర్పాటు చేయగా ఇటీవల తలసేమియా, సికిల్‌సెల్, ఎనీమియా బాధితులైన చిన్నారులు సేవలు పొందేందుకు నూతనంగా 30 బెడ్లను ఏర్పాటు చేశాం.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న విప్ రేగా

కరకగూడెం: తనను నమ్ముకున్న ప్రజలకోసం ఎంతకైన తెగించి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండల పరిధిలోని బుర్గారం అటవీ ప్రాంతంలోని సువర్ణగిరి జ్వాల నృసింహ స్వామి సమ్మక్క–సారలమ్మతో పాటు శివాలయాన్ని సందర్శించారు. అనంతరం నృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ అహర్నిషలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, తాను నియోజకవర్గ అభివృద్ధి కోసం తెస్తున్న నిధుల ఆధారంగా ప్రజల వద్దకు వెళ్లి చర్చపెట్టాలని, తద్వారా గత పాలకులకు, ప్రస్తుత పాలనకు వ్యత్యాసం చూపించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పులుసుబొంత ప్రాజెక్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అన్ని గ్రామాలకు రహదారులు నిర్మించుకోవడం జరిగిందని, త్వరలోనే మండలానికి వట్టివాగు ప్రాజెక్టు, బ్రిడ్జీలు, రహదారులు ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను నియోజకవర్గం కోసం వందల కోట్ల రూపాయలు తెస్తుంటే కొంతమంది చూసి ఓర్వలేక కమీషన్ కోసం నిధులు తెచ్చుకుంటున్నాడని అనడం వారి అవివేకమని అన్నారు. వేసవి కాలం దృష్ట్యా పలు గ్రామాలకు రూ.5 లక్షల చొప్పున సుమారు రూ.4 కోట్ల నిధులను కేటాయించానని తెలిపారు. త్వరలోనే మండలంలో ఫంక్షన్‌హాల్ నిర్మాణంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ అంతర్గత రహదారులు, ప్రజలందరూ ఆశ్చర్యపడేవిధంగా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నానని వెల్లడించారు. అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సమావేశంలో ఎంపీపీ రేగా కాళిక, పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, నాయకులు అక్కిరెడ్డి సంజీవరెడ్డి, కొంపెల్లి పెద్దా రామలింగం, రాంబాబు, రేగా సత్యనారయణ, అక్కిరెడ్డి వెంకటరెడ్డి, పఠాన్ యాకుబ్ ఖాన్,రావుల రవి, వేణు, ప్రసాద్, పలు పంచాయతీల సర్పంచ్‌లు ఊకే రామనాథం, పాయం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావంతో ప్రశాంతత

మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆలయ సందర్శన సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సీఎం కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయుఆరోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించినట్లు విప్ రేగా తెలిపారు. ఆలయాల అభివృద్ధి కోసం అన్ని విధాలుగా సహకరిస్తానని పేర్కొన్నారు. తొలుత ఆలయ అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో సమీక్ష



సీతారామ మ్యాపును పరిశీలిస్తున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఎస్ఆర్ఎల్ఐపీ) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధికారులకు సూచించారు. గండుగులపల్లిలోని స్వగృహంలో ఆదివారం ఆయన ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మ్యాపును పరిశీలించి, పనుల పురోగతిపై పలుసూచనలు చేశారు. జూన్, జూలై మాసాల్లోగా పెండింగ్ పనులను పూర్తిచేసి, ప్రజలకు సీతారామ నీళ్లు అందించాలని అన్నారు. భూకేటాయింపులు, ప్రాజెక్ట్ పెండిగ్‌లో నెలకొన్న పరిస్థితులను ఇరిగేషన్ సీఎస్ రజత్‌కుమార్‌తో ఫోన్‌లో వివరించారు. వెంటనే పనులను పూర్తయ్యేలా చూడాలని అన్నారు. నిధుల కేటాయింపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఇరుజిల్లాల కలెక్టర్లతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం మార్పు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఈ నెల 27 నుంచి చర్ల రోడ్‌లోని ఎంపీడీఓ కార్యాలయానికి మార్చుతున్నట్లు మదర్ అండ్ చైల్డ్ హెల్త్ జిల్లా అధికారి డాక్టర్ చైతన్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ వాసు గమనించి కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్టీ జాబితాలో తెగలను సహించం

చంద్రుగొండ: ఎస్టీ జాబితాలో ఇతర తెగలను కలిపేందుకు చేస్తున్న ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కాకా మహేష్‌దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వ నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జీఓ నంబర్ 3ను రద్దు చేసిన ప్రభుత్వం తాజాగా ఇతర 11 తెగలను ఎస్టీజాబితాలో చేర్చాలని చూడటం సరికాదన్నారు.

ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

చంద్రుగొండ: ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు వర్తింపజేయాలని రాజకీయపార్టీలు తీర్మానాలు చేయాలని కులవివక్ష పోరాటసమితి జిల్లా సహాయ కార్యదర్శి రాయి రాజా కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యువత ఉపాధి అవకాశాలు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. వెంటనే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని, లేనిపక్షంలో ఆయా పార్టీల నాయకులను నిలదీస్తామని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఇఫ్టూ నాయకులు

మణుగూరురూరల్: రాజ్యాంగం సాక్షిగా మహిళలకు రక్షణ కల్పించాలని, వైద్యవిద్యార్థిని ప్రీతిని మానసిక వేధింపులకు గురి చేసిన డాక్టర్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో పీవీకాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మహిళలు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ నాయకులు మంగీలాల్ మాట్లాడుతూ.. కాకతీయ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థిని ప్రీతిని అదే కళాశాలకు చెందిన సీనియర్ విద్యార్థి డాక్టర్ సైఫ్ ర్యాగింగ్‌కు పాల్పడడం అమానుషమన్నారు. సైఫ్‌కు రాజకీయ నేపథ్యం ఉండంతో కేసును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నం కొనసాగుతోందని ఆరోపించారు. ఇది సరైన చర్య కాదన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన సైఫ్‌ను ర్యాగింగ్ నిరోధక చట్టం కింద వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కళాశాల ప్రిన్సిపల్‌పై కూడా పలు అనుమానాలు ఉన్నాయని, తగు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేటి సమాజంలో మహిళలు, యువతులపై వేదింపులు, అత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ, యువతుల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో స్త్రీని గౌరవించే విషయంలో సమూల మార్పులు తేవాల్సిన అవసరం ఉందన్నారు. కె.రమాదేవి, నాగమణి, కమల, వాణి, ఎం.మోహన్, శివ, సతీష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం వద్దగల ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం, గోగులపుడి సమీపంలోగల అటవీ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి వివిధ రకాల పూజలు చేసి మొక్కు బడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్న సమయంలో అన్నసమారాధన కార్యక్రమాలను ఇక్కడ నిర్వహించారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం




శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు, పాల్గొన్న వెంకటేశ్వరరెడ్డి దంపతులు

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీవీకాలనీలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం శ్రీవారి చక్రస్నానం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు ప్లానింగ్ జి.వెంకటేశ్వరరెడ్డి దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. స్వామివారి సుప్రభాత సేవతో ప్రారంభమైన వేడుకలు, సేవాకాలం, శాంతిమంత్ర పాఠం, శాత్తుముర్రై, శ్రీసుదర్శన హోమంతోపాటు స్వామివారికి చక్రస్నానం వైభవంగా చేశారు. 33 కోట్ల దేవతలు, 33 కోట్ల పితృదేవతలు, 33 తాళాలు, 33 రాగాలు, 33 వేదమంత్రాలను వేదపండితుల నడుమ భూమిమీదకు స్వామివారిని ఆహ్వానించి సింగరేణీయులు, లోకంలో సమస్త ప్రాణకోటి సుభిక్షంగా సంతోషంగా ఉండాలని పూజలు చేశారు. అనంతరం స్వామివారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 4 వేలకు పైగా భక్తులు స్వామివారి అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ప్రాజెక్టు ప్లానింగ్ దంపతులు జి.వెంకటేశ్వరరెడ్డి–సునిత, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ కార్పొరేట్ సీహెచ్ నర్సింహారావు, ఏరియా జీఎం దుర్గం రాంచందర్ దంపతులు, ప్రాజెక్టు అదికారి లక్ష్మీపతిగౌడ్, డాక్టర్ శేషగిరిరావు, నాగేశ్వరరావు దంపతులతోపాటు పిచ్చేశ్వరరావు, ప్రభాకర్‌రావు, కాపా శివాజీ, సీతారామిరెడ్డి ఇతర అదికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రహదారికి మోక్షమెన్నడో..



మండల పరిధిలోని మొండికుంట నుంచి తుమ్మలచెరువు, గొందిగూడెం మీదుగా అశ్వాపురం వెళ్లే రహదారి అధ్వానంగా ఉండి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. 20 గిరిజన గ్రామాలను కలుపుతూ వెళ్తున్న ఈ రహదారి సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనుల కారణంగా రహదారిపై భారీ యంత్రాలు, వాహనాలు తిరిగి ధ్వంసమైంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మించి తమ కష్టాలు తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు. – అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి: రాంబాబు, ఆర్అండ్‌బీ ఏఈ

ఫోన్ నంబర్: 9441435367

వివాదాస్పదంగా శిలాఫలకం!



ఆ శిలాఫలకం ఇదే..

అశ్వారావుపేటరూరల్: శిలాఫలకంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ ఉపాధ్యాయుడి పేరు పెట్టడం వివాదస్పదంగా మారుతోంది. ఏలాంటి హోదా, స్థాయి లేనప్పటికీ.. ఓ రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన శిలాఫలకంలో పేరు పెట్టడం ప్రస్తుతం ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. ఈ వ్యవహారంపై కొంతమంది ఉపాధ్యాయులు ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో వెలుగులోకి వచ్చింది. తోటి ఉపాధ్యాయులు దీనిపై మండిపడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.

వివరాలను పరిశీలిస్తే.. అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం 'మన ఊరు–మన బడి' అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. కాగా మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి పాఠశాల ఆవరణలో స్థానిక అధికారులు శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఈ శిలాఫలకంలో ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్ చైర్మన్, రాజ్యసభ సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా, మండల స్థాయి అధికారుల పేర్లుతోపాటు, డీఈఓ, ఎంఈఓ, ఆ పాఠశాల హెచ్ఎం, కాంప్లెక్స్ హెచ్ఎం పేర్లు ఉండాలి. కానీ శిలాఫలకంలో కాంప్లెక్స్ హెచ్ఎం పేరు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఏలాంటి ప్రొటోకాల్ లేని ఇదే పాఠశాలకు చెందిన ఓ కింది స్థాయి ఉపాధ్యాయుడి పేరును శిలాఫలకంలో పెట్టడం వివాదానికి కారణం అవుతోంది. శిలాఫలకంలో హెచ్ఎం పేరుతో సహా ఉపాధ్యాయుడు అనే హోదాతో ఓ ఉపాధ్యాయుడి పేరును పెట్టడం పట్ల మిగిలిన ముగ్గురు ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక ఎంఈఓ పి.కృష్ణయ్యను 'సాక్షి'ఫోన్‌లో వివరణ కోరగా.. తాను జూమ్ మీటింగ్‌లో ఉన్నానని, ప్రొటోకాల్ విషయంపై తర్వాత మాట్లాడుతానని కట్ చేశారు.

ఎన్నాళ్లీ ఇళ్ల నిర్మాణం?

- అసంపూర్తిగా డబుల్ బెడ్రూం ఇళ్లు
- విద్యుత్, డోర్ల ఏర్పాటులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్న గృహాలు



గౌరారం పంచాయతీలో నిర్మాణం పూర్తికాని డబుల్ బెడ్రూం ఇళ్లు

దుమ్ముగూడెం: ప్రతి పేదవాడికి గూడు కల్పించి అండగా ఉండామనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం సాగుతోంది. ఇళ్ల నిర్మాణం ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ పూర్తికాక లబ్ధిదారులకు అందలేదు. దీంతో గంపడాశెలతో ఉన్న నిరుపేదలకు నిరాశ ఎదురవుతోంది. ఇది డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యానికి, కాంట్రాక్టర్‌ల ఇష్టారాజ్యానికి నిదర్శనం.

మండలంలోని గౌరారం పంచాయతీకి తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చేందుకు 25 డబుల్ ఇళ్లను మంజూరు చేసింది. ఈ ఇళ్ల నిర్మాణాన్ని గౌరారం గ్రామ శివారులో రోడ్డు పక్కన చేపట్టారు. నిర్మాణం చేపట్టి ఇప్పటికే సంవత్సరాలు కావస్తున్నాయి. కానీ నేటికీ నిర్మాణం పూర్తికాలేదు. ఆ ఇళ్ల చుట్టూ చెట్లు పిచ్చి మొక్కలు పెరిగాయి. లక్షల రూపాయలతో కట్టిన ఇళ్లు పాడైపోతున్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతున్నాయి. డబుల్ ఇళ్ల సముదాయం రోడ్డు పక్కనే ఉండటంతో గ్రామ శివారులో ఉండటంతో మందుబాబులకు అడ్డాగా మారుతోంది. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ తలుపులు, కిటికీలు, విద్యుత్ సరఫరా, నీటి సదుపాయం కల్పించకుండా పనులు మధ్యలోనే వదిలేశాడు. అధికారులు ఇళ్ల నిర్మాణం పూర్తి కాకుండానే పంచాయతీ పరిధిలోని నిరుపేదలకు ఇళ్లు కేటాయించేందుకు సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు ఎప్పుడు పూర్తవుతుందో అని గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. మండలంలో అధికారుల, కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యం వల్ల డబుల్ ఇళ్లు ఇలా నిర్లక్ష్యానికి గురయ్యాయి.

అధికారులు పట్టించుకోవడం లేదు..



గౌరారం పంచాయతీలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు సగంలోనే వదిలేశారు. నిర్మాణం కాకుండా లబ్ధిదారులను ఎంపిక చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇళ్లకు తలుపులు, కిటికీలు, విద్యుత్, మంచినీటి సదుపాయాలు లేవు. అవి కల్పిస్తే లబ్ధిదారులు ఇళ్లల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. సమస్యలపై జిల్లా, మండల అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదు.

– సోడి జ్యోతి, గౌరారం సర్పంచ్